(14)

# సుడిగాలిలోని దీపం

రచన :
శ్రీమతి ఆర్. వసంత

"......... ఇదీ జరిగింది బాబాయిగారు. ప్రతి మానవుడు వుందయం నుండి సాయంకాలం అయ్యేదాకా ఏదో ఒక మంచిపని చేయాలని, యితరులకు సహాయం చేసి, ఆ ఆనందంలో కొందరు సంతృప్తి, సంతోషం పొందుతారు. ఆలాంటి వారిలో నాకు భాగం వుంది.

నాకు నా అనేవాళ్ళు లేరు. ఈ ఆఫీసు, యిక్కడ పనిచేసేవాళ్లు, మీరు తప్ప యింకెవరి తోనూ స్నేహం పెంచుకోన్నది లేదు. పుట్టిన వెంటనే తల్లిని పోగొట్టుకొన్నాను. తోడబుట్టిన చెల్లెలుగాని, తమ్ముడుగాని లేరు. గోపిబాబును చూడగా ఎనలేని అభిమానం, ఆప్యాయత నాలో కలుగసాగింది.

పూర్వజన్మలో ఏ దంపతులను విడదీశానో, యీ జన్మలో దాంపత్య సౌభాగ్యం లేకుండా చేశాడు భగవంతుడు. అని కన్నీళ్ళు కారుస్తూ రెండు నిమిషాలు చెప్పలేకపోయింది రాధాదేవి.

"కాని...కాని... ఈ జన్మలో ఆగిపోయే వివాహాన్ని ఆదుకొని, గోపి, గౌరి జంటలకు పెండ్లి చేసి, కొంత పుణ్యాన్ని సంపాదించుకొన్నాను. అందం, గుణం, అణకువగల గౌరిన్ని నా చేతులారా "చక్కటి భర్తతో, పిల్లాపాపలతో నిండు సౌభాగ్యవతివై, నూరేండ్లు జీవించాలని" ఆశీర్వదించాను.

కాని నా ఆశీర్వాదంకు ఫలితం లేకపోతుందో అని బాధపడ్డాను. ఆ సమయంలో భగవంతుడు యీ గౌరికి గోపిబాబు తగినభర్త అని ఏనాడో వ్రాసివుండబట్టి, దాన్ని మార్చడం మానవులకు సాధ్యమా. అందువలన రామయ్య దుఃఖాన్ని పోగొట్టడానికి, గౌరికి పెండ్లి జరిపించడానికి, గోపిబాబుతో చెప్పి యీ పెండ్లి వూహించని విధంగా జరిగింది" అని రాధాదేవి పూర్తి చేసింది.

అంతా విన్న రాఘవరావు మనసులోనే "కొందరి మనసులో భగవంతుడు వుంటాడం టారు ఇదేనేమో. పాపం రాధాదేవి జీవితంలో విధి ఎదురుతిరిగిందే కాని, ఆమె చేసే ప్రతి పని ఎదుటివారికి మంచి జరిగే విధంగా జరుగుతుంది. భగవంతుడా! ఇలాంటి మనసుగలవారికి, చిన్న చూపు చూడకు. వారిని అనుగ్రహించి కాపాడు. అని మనసులో ఏదేదో అనుకొని ప్రార్థించ సాగాడు.

"బాబాయిగారు! ఏమిటి ఆలోచిస్తున్నారు" అని రాధాదేవి అడగడంతో యీ లోకానికి వచ్చారు రాఘవరావు.

"మరేం లేదమ్మ! భగవంతుని సృష్టిని గురించి ఆలోచిస్తున్నాను. అందరిని మంచిగా చూసే మీరు, కల్లాకపటం తెలియని గోపి బాబు, మీ నీడలో తన జీవితంలో మంచిని, పరమార్థం పొందాడు. మీరు అతను పెండ్లికి బయలుదేరి, అక్కడకు వెళ్లి చాలాసేపు వుండి ననూ, తనకు పెండ్లి జరుగుతుందని వూహించి వుండరు. చివరి సమయంలో మీవలన గోపికి మంచి భార్య లభించింది. గౌరికి ఉత్తముడైన భర్త లభించాడు.

అలాగే మీరు రవి బావను పెండ్లి చేసుకొని సుమంగళిగా, పిల్లాపాపలతో "నూరేండ్లు వుండాలని నా కోరిక" అన్నాడు.

ఆ మాటలకు రాధాదేవి మనసులోనే కొంత బాధపడింది. నిముషం తర్వాత "ఆ శుభగడియ నాకు యీ జన్మలో లేదు బాబాయిగారు" అన్నది.

"ఎందుకు మీ యిరువురికి పెండ్లి జరుగదు. మీకు వయసు లేదా? అందం లేదా? రవి ఏమైన గుణవంతుడు కాడా? చెప్పమ్మా!" అన్నాడు రాఘవరావు.

"మీకు తెలవదండి బాబాయిగారు. ఒక సారి పెండ్లిఅయిన ఆడదానికి యీ లోకంలో స్థానం వుందా? అందులోనూ భర్తచే విడాకులు పొందిన ఆడదాని జీవితంలో పుష్పించి ఆనందించే భాగ్యం వున్నదా? మీరే చెప్పండి" అని బాధతో అంటూ వుంటే.

"ఈ ప్రపంచం చాలా ముందుగా వుందమ్మా! ఒకసారి సాయంకాలంసమయంలో అలా బజారు వెళ్ళి చూడండి. ఆడ మగ తేడా లేకుండా, అందరు ఒకవిధంగా గొట్టాం పేంటు వేసుకొని స్వేచ్ఛగా తిరిగే విధంగా ముందుకు సాగిపోతూ వుంది. నీవేమన్నా తెగత్రెంపులు తెంచుకో లేదు. ఇంతటి అందం, గుణంగల నీతో సంసారం చేయుడానికి యిష్టంలేక, అతనే నీతో విడాకులు కోరి త్రెంచుకున్నాడు.

చిన్నప్పుడు పెండ్లిఅయి ఆడది భర్త చని పోతే, ఆమెకు మళ్ళీ పెండ్లి చేస్తున్నారు. పిల్లా పాపలతో తన భర్త నీడల్లో బంగారు బాటను నిర్మించుకొంటున్నారు ఆడవాళ్ళు కాలానికి అనుగుణంగా మారాలని నా కోరిక. "మీరు, రవి ఇరువురు పెండ్లి చేసుకొని నూరేండ్లు చల్లగా వుండాలని నా కోరిక" అన్నాడు. ఆ మాటలు విన్న రాధాదేవి మనసులోనే బాధపడుతూ, రెండు నిముషాలు అలాగే వుండిపోయింది.

ఏడుస్తూ "బాబాయిగారు! ఇప్పుడు నన్నేమి చెయ్యమంటారు" అన్నది.

"అన్ని తెలిసిన నీకు నేను చెప్పాలామ్మా! రవి తన జీవితంలో నిన్ను తప్ప వేరేవారినికూడ చూడకుండా తన హృదయంలో ఆరాధిస్తు న్నాడు. అలాంటి దృఢప్రేమ, ఆత్మవిశ్వాసంగల వ్యక్తి దొరకడం చాలా కష్టం. ఏ కోటికి ఒక్కరు వుంటారు. నీకు జరిగిందంతా ఒక పీడ కలలాగ మరచి, అతన్ని పెండ్లాడి నీవు సుఖ శాంతులతో వుండాలి. ఈ సమయం మించితే, మీరిరువురు వయసు మళ్ళిన తర్వాత ఏమీ లాభం లేకుండాపోయి వ్యర్థమవుతుంది జీవితము" అని బోధించాడు రాఘవరావు.

ఇంతలో డ్రైవరు రహీం తలుపు తెరచుకొని గదిలోనికి వచ్చి "అమ్మా! మీరు చెప్పినట్లు స్వీట్సు, కారం, కాఫీ "హోటల్ స్వప్న"





జుపిటర్ వారి అత్యుత్తమమైన తయారింపులు!

• జుపిటర్ ఫైన్ • వెస్టన్ • షోర్
• కూల్ టెక్స్ • విజయ్ • కాస్మో

మీరు బనియన్లు కొనే ముందు "జుపిటర్" మార్కు వున్నదా అని చూచి కొనండి.

హైదరాబాదు - సికిందరాబాదు మినహా అన్ని చోట్లలో ఏజెంట్లు కావలెను.

తయారించువారు

Grams : JUPITER Phone : 20670

**Jupiter Knitting Company**

Lakshminagar Main Road,
TIRUPUR - 638 602.

నుండి తీసుకవచ్చానమ్మా. అందరూ మీకోసం ఎదురుచూస్తున్నారు'' అన్నాడు.

ఆ మాటలు విన్న రాధాదేవి "గోపిబాబు, గౌరివాళ్ళు వచ్చారా ?'' అన్నది. రహీం "వాళ్లు కూడ వచ్చారు'' అనడంతో రాఘవ రావు, రాధాదేవి యిరువురు బయలుదేరారు.

సాయంకాలం 4-30 గం॥లు కావస్తుంది. ఆఫీసు స్టాపు, గోడౌన్‌లో పనిచేసే వాళ్ళు అందరు టేబుల్ మీద కూర్చొని వున్నారు. వారి ముందు ప్లేటులో రెండు స్వీట్సు, కారంపొట్లం. అరటిపండు వుంచబడివుంది.

నూతన వధూవరులైన గోపిబాబు, గౌరి ప్రత్యేకమైన కుర్చీలో కూర్చొనివున్నారు. వారికి స్వీట్సు వుంచబడివుంది. వారిప్రక్కన రాఘవ రావు, అసిస్టెంటు మేనేజరు, రాధాదేవి కూర్చొని వున్నారు.

రాధాదేవి లేచి డియర్ ఫ్రెండ్స్! ఈరోజు చాలా మంచిరోజు. మన ఆఫీసులో పనిచేస్తున్న రామయ్యగారి కుమార్తె గౌరికి, మనతో కలిసి మెలిసి పనిచేస్తున్న గోపిబాబుకు వివాహం వైభవంగా జరిగింది. ముఖ్యంగా ఈ వివాహం జరుగుతుందని మన గోపిబాబుగాని, నాకుగాని తెలియదు. అంతా భగవంతుని సంకల్పం వలన జరిగింది'' అంటూవుండగా కరతాళ ధ్వనులు మారుమ్రోగింది.


"ముఖ్యంగా ఏ కానికట్నం లేకుండా యీ పెండ్లి జరిగిందంటే, గోపిబాబును అభినందించాలి. ఇలాంటి యువకులు ముందుకు రావాలి. బీదరికంతో అలమటిస్తూ, ఆడవాళ్ళకు పెండ్లి చేయలేని తల్లిదండ్రులకు చేయూత నివ్వాలని నా కోరిక'' అని రెండు దండలు తెచ్చి గోపిబాబుకు, గౌరికి యిచ్చి—

"అమ్మా గౌరి! మీరు యీ దండలు వేసుకోండి'' అన్నది.

గోపిబాబు గౌరి మెడలో దండవేశాడు. గౌరి గోపి మెడలో దండ వేయగా, రూములో కరతాళధ్వనులు మ్రోగసాగింది.

"ఈ శుభసమయంలో నేను నూతన వధూవరులకు, మీకు ఈ పార్టీ యిస్తున్నాను'' అనడంతో అందరు స్వీట్సు, కారం తినడం ప్రారంభించారు.

(ఇంకావుంది)



సురేష్ ప్రొడక్షన్స్ వారి
"కథానాయకుడు"
చిత్రంలో
బాలకృష్ణ - విజయశాంతి